



దీపాలు పెడుతూండగా హడావుడిగా ఇల్లు చేరుకున్నాడు శివయ్య. గుడ్డిగా వెలుగుతున్న కాంతిలో గడ్డం గీసుకుని స్నానం కూడా అయిందనిపించాడు. ఉన్న వాటిలో డాబుగా ఉండే బట్టలు వేసుకొని తల దువ్వుకొంటూండగా అడిగింది జానకి-


"ఏమండీ! బయటకు వెడుతున్నట్లుగా ఉన్నారు-మళ్ళీ ఎంత సేపట్లో వస్తారు?"

"ఆలశ్యం అవుతుందేమో! ఏం-ఏం కావాలి?" జీతం అందుకోగానే ఇంట్లోకి కావలపిన వస్తువులన్నీ తెచ్చిపడేయడం శివయ్యకు అలవాటు.

"బుజ్జికి పొద్దుట్నుంచీ జ్వరం. మధ్యాహ్నం భోజనం కూడా చెయ్య

లేదు. డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళి చూపించాలి....”

“జ్వరమా!” అంటూ వెళ్ళి మంచంమీద పడుకున్న బుజ్జి వంటి మీద చెయ్యివేసి చూశాడు. పెనంలా కాలిపోతుంది. పదిరోజుల క్రితం తనతో పనిచేసే మూర్తి కూతురికి కూడా ఇలాగే జ్వరం వచ్చింది. ఆదే తగ్గిపోతుంది గదా అని నిర్లక్ష్యం చేశాడు. మూడోనాటికల్లా జ్వరం ఎక్కువయి ప్రాణమే పోయింది. ఆ విషయం గుర్తుకు రాగానే శివయ్య గుండె ఝల్లు మంది. జేబులో చిల్లిగవ్వ లేదు. పైగా నెలాఖరురోజులు కావటంతో మరీ ఇబ్బంది....



"నీ దగ్గరేమైనా డబ్బులు వున్నాయా?" ఉండవని తెలుసు. అయినా అడిగాడు జానకిని. అడ్డంగా తల ఊపింది.

నెలాఖరు రోజుల్లో శివయ్య దగ్గర కూడా డబ్బులుండవని జానకికి తెలుసు. "పోనీ-మన వీధి చివరున్న రెడ్డిగారికి చూపిస్తే?" తనకు తోచిన సలహా ఇచ్చింది.

రెడ్డి గవర్నమెంటు హాస్పటల్లో కాంపౌండరుగా చేస్తుంటాడు. ఇంటి దగ్గర ప్రయివేటు ప్రాక్టీసు వుంది. చిన్న చిన్న రోగాలకు-మాత్రలు, టానిక్కులు ఇస్తుంటాడు. మరీ అవసరం అనుకొంటే ఇంజక్షన్ కూడా చేస్తాడు. ఒక్క పదిరూపాయలు ముందుగా యిస్తే—రెడ్డి, రోగికి ప్రాణాలే పోసేస్తాడని ఆ వీధంతా చెప్పుకుంటారు. తనతో ఉద్యోగం చేసే వారిని ఎన్నిసార్లు అడిగినా అభిమానం చంపుకోవడమే గాని ఫలితం ఉండదు. పైగా 'ఖరీదయిన మనుష్యులతో తిరిగేవాడివి-నీకు డబ్బు ఇబ్బందేమిటోయ్?' అని ముఖం మీద అన్నా అంటారు.

'ఒక్క పది రూపాయలుంటే రెడ్డికి చూపించి ఇంజక్షన్ చేయించవచ్చు.'

"బుజ్జిని రెడ్డిగారి దగ్గరకు తీసుకు వెడతారా?" ఆలోచిస్తూ నిలబడ్డ శివయ్య ఉద్దేశ్యమేమిటో అర్థంకాలేదు జానకికి.

"ఊహూం-ఇప్పుడు ఆఫీసుల్లో అర్జంట్ పని వుంది ఎలాగో ఈ రాత్రి గడవనీ. ప్రొద్దుట తీసుకు వెడదాం." భార్య మరో మాట మాట్లాడే అవకాశం లేకుండా బయటకు నడిచాడు.

* * *

బి.ఎ. రెండవ సం॥లోకి వచ్చేవరకూ శివయ్య జీవితం వడ్డించిన విస్తరిలానే ఉంది. అమ్మాయిలను ఏడిపించడమన్నా, లెక్చరర్స్‌న్ని విసిగించడమన్నా శివయ్య తరువాతే ఎవరయినా. పుట్టింది మొదలు జీవితంలో వినోదమే చూసాడు గాని విషాదం ఎరుగడు.

జీవితమంతా పూలబాటే అనుకొంటున్న శివయ్యపట్ల విధి చిన్నచూపు చూపింది. ఊహించని విధంగా వ్యాపారం దివాలా తియ్యడంతో శివయ్య తండ్రి మనోవ్యాధితో కన్నుమూశాడు. ఉన్న ఆస్తి అంతా అప్పుల వాళ్ళు ఎగరేసుకుపోగా కన్నతల్లి, పెళ్ళి కావలసిన చెల్లెలు శివయ్యకు సమస్యగా నిలిచిపోయారు.

చదువుకు స్వస్తి చెప్పేశాడు. అతికష్టంమీద తన బంధు వర్గం

లోనిక్కుర్రాడ్ని చూసి చెల్లెలి పెళ్ళి అయిందనిపించాడు. అతడి చెల్లెలు జానకిని తన భార్యగా స్వీకరించి గృహస్థుడయ్యాడు. ప్రయివేటు కంపెనీలో నెలకు 300 రూ॥ల ఉద్యోగం సంపాదించి, అద్దె కొంపలో గుట్టుగా సంసారం నెట్టు కొస్తున్నాడు.

పరిస్థితులు ఇంతగా దిగజారినా అతనిలోని కోరికలు దిగజారి పోలేదు. వాటినితీర్చుకోడం కోసమే తప్పని సరిగా మిత్రులిచ్చే పార్టీలకు హాజరవుతుంటాడు. జానకితో అబద్ధం చెప్పి ఊరు చివరున్న ట్రావెలర్స్ బంగళాకేసి బయలు దేరాడు.

* * *

ఆ గదిలో—బీర్ బుసబుసలు, గ్లాసుల చప్పుడు, ఛీర్సులు, చిప్పు కరకరలు వరుసగా వినిపిస్తు న్నాయి.

'బుజ్జికి జ్వరం—డాక్టరు దగ్గరకు తీసుకువెడితే ...' బీరు తాగుతున్నాడేగాని జానకి మాటలే గుర్తుకు వస్తున్నాయి శివయ్యకు. 'ఒక్క—పదిరూపాయలుంటే బుజ్జిని డాక్టరుదగ్గరకు తీసుకు వెళ్ళి ఇంజక్షన్ వేయించేవాడు. అప్పుడు తనకీ తృప్తీ ఉండకపోను—ఒక్క పదిరూపాయలు...'

"శివయ్య లేందే మన మెప్పుడైనా పార్టీ చేసుకొన్నామా? ఏ పార్టీ అయినా సరే—శివయ్య ఉండి తీరాల్సిందే!" ఎంతో అభిమానంగా అంటాడు రాజు.

'వాడ్ని అడిగితే?

'శేఖర్ అందర్లోకి బాగా ఉన్నవాడు. పేకాట్లో ఎన్నివేలు తగలేస్తాడో వాడికే తెలీదు. వాడయితే?

'ఖరీదైన సిగరెట్లు, స్మగుల్డు వస్తువులు అంటే మోజు సునీల్‌కి. పది రూపాయలు వాడి సిగరెట్ల ఖర్చంతకాదు. వాడ్ని అడిగితే?'

"ఏరా! ఏమిటి పరధ్యానంలో పడ్డావు?" భుజం తడుతూ అన్నాడు రమణ.

"అబ్బే—ఏంలేదు." నవ్వడానికి ప్రయత్నించాడు. రమణ ఖాళీ గ్లాసు నింపుకోవడంలో ఉండి పోయాడు.

'వీడు మనుష్యుల్ని బాగా అర్థం చేసుకొంటాడు—వీడ్ని అడిగితే?' రమణవంక చూస్తూ అనుకున్నాడు శివయ్య.

"అరేయ్! సాయంత్రం ఊర్వశి దగ్గర సుధాకర్ కనుపించాడు...." ఖాళీ గ్లాసు టేబిల్ మీద పెడుతూ అన్నాడు శేఖర్.

"ఏమన్నాడు?" శేఖర్ గ్లాసు బీరుతో నింపుతూ అన్నాడు రమణ.

"వాడి మొహం-వాడేమంటాడు? కార్లోపోతూ ఒకే ఒక్క నిముషం చూసుంటాను వాడ్ని. బాగా చిక్కిపోయాడు. మందుకొట్టి ఎన్నాళ్ళయిందో? ముఖం మరీ డొక్కుపోయింది."

"పోనీ—వాడ్ని పార్టీకి రమ్మ నాల్సింది!" జాలిగా అన్నాడు శివయ్య.

సుధాకర్ కూడా ఒకప్పుడు వీళ్ళతో సమానమైనవాడే! భూమి తగాదాలవల్ల కోర్టులచుట్టూ తిరిగి ఉన్నదంతా ఆర్పేసుకొని నలుగురి లోనూ చులకనయిపోయాడు.

"వాడ్నా! ఛ-ఛ! మన ఆనందం చెడగొట్టడానికా? ఎక్కడ కనబడినా 'అప్పు—అప్పు' అంటూ ఒహటే ఏడుపు" అన్నాడు శేఖర్.

శివయ్యకు గుటక పడలేదు. గొంతులోకి చల్లగా జారాల్సిన కూల్డుబీర్ గరళంలా కంఠంలోనే ఆగిపోయి ఊపిరాడక పొల మారింది.

"ఏరోయ్!.... ఎవరో తలుపు కొంటున్నారులా ఉంది?"

"ఆఁ—ఆఁ. కల్యాణి తలుపు కొంటుందిలా ఉంది!" తన ముఖం లోని భావాలు కప్పిపుచ్చుకొంటూ చటుక్కున అనేసాడు శివయ్య.

'ఇంకా నయం—నోరు తెరిచి వీళ్ళలో ఎవర్నయినా సరి రూపా యలు అడిగాను కాదు' అని మన సులో అనుకోక పోలేదు.

"కబురుచేసాను—వస్తుంది. అదుగో సోమయ్య వచ్చాడుగా—కళ్యాణి కూడా వచ్చే ఉంటుంది." కారేజీలు చేత్తో పట్టుకొని గదిలోకి వచ్చిన వాచ్‌మన్ సోమయ్యను చూస్తూ అన్నాడు శేఖర్.

"ఆయమ్మ రాలేదు బాబు.స్యా! నాలుగు రోజుల్నుంచీ జ్వరమట. మూసిన కన్ను తెరవకుండా పడుంది. రంగమ్మ కంపెనీలో ఇంకా అందమైన అమ్మాయిలున్నా రట—మీరెవరైనా వచ్చి ఒకసారి చూసుకుంటే...." సోమయ్య తను తెచ్చిన కారేజీలు గదిలో బల్ల మీద పెడుతూ అన్నాడు.

'జ్వరం' అన్నమాటలు విన గానే కుర్చీలోంచి లేచాడు శివయ్య-"పద నేనొచ్చి చూస్తాను" అంటూ.

"ఎవర్ని? కల్యాణిని చూస్తావా-ఇంకెవర్నయినా సెలక్ట్ చేసి తీసు కొస్తావా?" తల ఎగరవేస్తూ అన్నాడు రాజు.

"జ్వరంతో పడివుందేమ మన కెందుకు? ఉన్నవాళ్ళలో ఎవర్న యినా తీసుకొస్తాను."

* * *

"పేరు రోజా! ఎలా ఉంది నా

సెలక్షన్?" ఓ అరగంట పోయాక కళ్ళు జిగేలు మనిపించేలా ఉన్న అందమైన అమ్మాయితో గదిలో ప్రవేశిస్తూ అన్నాడు శివయ్య.

రోజా అందం చూడగానే మతి పోయింది మిత్ర బృందానికి.

"నీలాటి అందమైన బొమ్మను తెచ్చినందుకు ఫస్ట్ ఛాన్స్ మా శివుడికే వదిలేసాం. వెళ్ళండా గదిలోకి." మాతలు పడిపోతున్న కనురెప్పల్ని బలవంతంగా అపు కొంటూ అన్నాడు శేఖర్.

రోజాను శివయ్యను పక్క గదిలోకి తోసాడు రమణ.

"రోజా! నీ దగ్గరో పది రూపాయలుంటే ఇస్తావా?" గది లోకి రాగానే మెల్లిగా అన్నాడు.

"చిత్రంగా ఉందే! ఒక్క రాత్రికి రెండు వందలు అడగ్గానే ఇచ్చి తీసుకొచ్చారే నన్ను. ఒక్క పదిరూపాయల కోసం నన్ను అడుగుతున్నారా?"

"రెండు వందలిచ్చాను— కాదనను. నువ్వడిగితే మా వాళ్ళ నడిగి మరో వంద కావాలన్నా ఇస్తాను. అది వాళ్ళ డబ్బు."

"మీకు కావలిస్తే వాళ్ళనే అడ గొచ్చుగా?" ఆశ్చర్యంగా చూస్తూ అంది రోజా.

"అడగలేను రోజా! స్నేహితు లైనా వాళ్ళను నేను అడగలేను. అడిగి వాళ్ళముందు చులకనయి పోలేను. జూదాలకు, వ్యసనాలకు వేలకు వేలు తగలేసే వాళ్ళను అవసరానికి పది రూపాయలు అడగడం చాలా హీనం. వాళ్ళు ఖరీదైన మనుష్యులు. అన్నీ ఖరీ దైన ఆలోచనలు. నేను సామా న్యుణ్ని. వాళ్ళ నైజం తెలిసినా వాళ్ళు నా క్కావాలి. ఎందుకో తెలుసా? నేనుకోరికలకు బానిసను." సిగ్గుతో ముఖం దించుకొంటూ అన్నాడు శివయ్య. అతని ఆవేదన అర్థం చేసుకొంది రోజా.

గుండెల దగ్గర దాచుకున్న పెట్టి చిన్న పర్సు తీసింది. "పది చాలా? ఇంకా కావాలా?" పది రూపాయల కాగితం తీసి శివయ్య చేతిలో పెడుతూ అడిగింది.

"థాంక్స్ రోజా! ఈ పదీ చాలు. కావలిస్తే మా వాళ్ళనడిగి మరో పాతిక తీసుకో. కాని ఒక్క రిక్వెస్ట్! ఈ విషయం వాళ్ళకు తెలియ నివ్వకు" అంటూ గది తలుపు తీసుకొని బయటకు వెళ్ళి పోయాడు.

కోరికలకు బానిసనని చెప్పి కోరిక తీర్చుకోకుండానే బయటకు వెళ్ళిపోతున్న శివయ్యను జాలిగా చూసింది రోజా.

కోరికలను అదుపులో పెట్టు కొనే ప్రథమ ప్రయత్నంగా శివయ్య వెళ్ళిపోయాడని రోజాకు తెలియదు. •